## క్లుప్తంగా...

### వైష్ణవిదేవీ అలంకరణలో అమ్మవారు



శంషాబాద్: పట్టణంలోని శృంగేరి మఠం శారదాదేవి ఆలయంలో అమ్మవారు బుధవారం వైష్ణవిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. సప్తశతి పారాయణం, గోపూజ కార్యక్రమాలు జరిగాయి.

### మాజీ ముఖ్యమంత్రి అంజయ్యకు ఘన నివాళి



మణికొండ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర సచివాలయం ముందు ఉన్న ఆయన విగ్రహానికి మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కౌన్సిలర్ కె. లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్ పాల్గొన్నారు.

### వందేళ్లు నిండిన ఓటర్లు ఐదుగురు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో వందేళ్లు దాటిన ఓటర్లు ఐదుగురు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 5,53,590 మంది ఓటర్లలో 0.01 శాతం 100–109 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న ఓటర్లు ఉన్నారన్నారు. మొత్తం ఐదుగురు వంద సంవత్సరాలు దాటిన ఓటర్లు ఉన్నారన్నారు.

### కారులో తరలిస్తున్న రూ.2.39,000 నగదు పట్టివేత

శంషాబాద్ రూరల్: అర్ధరాత్రి కారులో తీసుకెళ్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన తనిఖీలో భాగంగా.. శంషాబాద్ పోలీసులు మంగళవారం రాత్రి మండలంలోని నర్కూడ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సమయంలో శంషాబాద్ పట్టణానికి చెందిన వ్యాపారి గౌత వినయ్ తన కారులో రాత్రి కవేలిగూడ వైపు నుంచి శంషాబాద్ వస్తున్నాడు. నర్కూడ వద్ద కారును ఆపి తనిఖీ చేయగా.. అందులో రూ.2,39,900 నగదు పట్టుబడింది. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి రశీదులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపారు.


### కార్వాన్‌లో పుంజుకుంటున్న కాంగ్రెస్?

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పుంజుకుంటుంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందు నుంచే డివిజన్ల నాయకులు, కార్యకర్తల్లో ఎన్నికల సందడి నెలకొని ఆశావహులు కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ముస్లిం ఓటర్లు అధికంగా ఉండే కార్వాన్ నియోజకవర్గంలో ఈసారి ఎలాగైనా గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీల పథకానికి సైతం ప్రజల్లో మంచి స్పందన వస్తుంది. ఇదిలా ఉండగా సిట్టింగ్ ఎమ్మెల్యేను వ్యతిరేకించే వారు గత్యంతరం లేక కాంగ్రెస్ జెండా పట్టుకున్నారు. మరోవైపు దళితులు, బీసీలు ఈసారి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పెట్టని కోటగా ఉన్న దళితులు, బీసీలలో చాలా మంది ఈసారి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. అయితే.. టికెట్ కేటాయింపు విషయమై ఓ వర్గం నాయకులు ఒక్కటవ్వగా అధిష్ఠానం మాత్రం గతంలో కార్వాన్ నుంచి పోటీ చేసిన వ్యక్తికి టికెట్ కేటాయించింది. ఏదేమైనా ఈ సారి కార్వాన్‌లో కాంగ్రెస్ ఊపుమీద ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### రాత్రి 11గంటల లోపు షాపులు మూసివేయాలి

గచ్చిబౌలి: రాత్రివేళ అన్ని దుకాణాలు 11 గంటలలోపే మూసివేయాలని మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డీఎల్ఎఫ్ ప్రాంతం, మాదాపూర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్ట్రీట్ వెండర్స్‌తో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. రాత్రివేళ తనిఖీలు ఉంటాయని చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు, సబ్ ఇన్‌స్పెక్టర్లు శోభన్‌బాబు, భానుప్రసాద్, రాజశేఖర్ రెడ్డి, పోలీసులు, స్ట్రీట్ వెండర్లు పాల్గొన్నారు.

# శ్రీ మహాలక్ష్మిగా దుర్గాదేవి





మణికొండ క్వార్టర్స్‌లో అమ్మవారి పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్ శైలజ, మహిళలు

మణికొండ: దసరా నవరాత్రి ఉత్సవాలు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మణికొండ, నార్సింగి, పుప్పాలగూడ, నెక్నాంపూర్, మంచిరేవుల, కోకాపేట, గండిపేట, ఖానాపూర్, వట్టినాగులపల్లి, గౌలిదొడ్డిలలో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమలు, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

**భక్తిశ్రద్ధలతో పూజలు**

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ మండపాలతో పాటు దేవాలయాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాలలో సామూహిక కుంకుమార్చనలు, సంస్కృతిక కార్యక్రమాలు, దాండియా, అన్నదాన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తును. భక్తులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

**లక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు**

మైలార్‌దేవ్‌పల్లి: దేవినవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం,దుర్గానగర్ ,గణేష్ నగర్ ప్రాంతాలలో అమ్మవారు లక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పద్మశాలిపురంలో భూలక్ష్మమ్మ ఆలయంలో తొమ్మిది రోజులు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు.

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ శ్రీ విజయ గణపతి దేవాలయంలో అమ్మవారిని శాకాంబరి దేవీగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హైదర్షాకోట్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు.



నార్సింగిలో దుర్గామాత పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్ ప్రవీణ్‌కుమార్



పద్మశాలిపురంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం



వినాయక్‌నగర్ కాలనీలో..



వాసవి కన్యకపరమేశ్వరి దేవి ఆలయంలో..



కన్యకపరమేశ్వరి దేవి ఆలయంలో..

## నాలుగోసారి విజయం నాదే

జంగ్ 2023 తెలంగాణ

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు నన్ను నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటారని బీఆర్ ఎస్ అభ్యర్థి టి ప్రకాష్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం తన నివాసంలో సులేమాన్ నగర్ డివిజన్ ఎంఎంపహాడికి చెందిన పలువురు ఎండీ గౌస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల వారి అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పని చేస్తున్నదని అన్నారు.



కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

## ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి మల్లయ్య

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లను చేపడుతున్నట్లు రిటర్నింగ్ అధికారి మల్లయ్య వెల్లడించారు. ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజలు స్వేచ్ఛగా పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటును వినియోగించుకునేందుకు తగు ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం 535 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. అదనంగా మరో 10 బూత్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. బుధవారం నాటికి రూ.5,53,590 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ పేరును ఓటర్ లిస్టులో నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌తో పాటు బీఎల్‌ఓల వద్ద నమోదు చేసుకునేందుకు అవకాశముందన్నారు. కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. మార్పులు, చేర్పులకు అవకాశం లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం 41 రూట్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రూట్‌కు ఒక సెక్టోరల్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ సెక్టోరల్ తమ పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్ వద్దకు వెళ్లి మౌలిక వసతులన్నీ పరిశీలిస్తారన్నారు. ఎప్పటికప్పుడు వసతులపై నివేదిక అందిస్తారన్నారు. నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లలో దాదాపు మౌలిక వసతులన్నీ ఉన్నాయన్నారు. కొన్ని బూత్‌లలో వికలాంగులు, వృద్ధుల కోసం ర్యాంపులు లేవని.. వాటిని నిర్మించాలని జీహెచ్ఎంసీ, మున్సిపల్ కార్పొరేషన్, గ్రామ పంచాయతీ అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 80 ఏళ్లు పైబడి నడవలేక ఉన్న వారు వికలాంగులు తదితర వారి కోసం నేరుగా ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. వారికి ప్రత్యేకంగా ఫామ్–12డీ ఫామ్‌ను అందిస్తామన్నారు. వాటిని పూర్తి చేసి బీఎల్‌ఓకు అందించాలన్నారు. బీఎల్‌ఓ పరిశీలించి అందుకు సంబంధించి నిర్ణయం తీసుకుంటారన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని... ఫ్లైయింగ్ స్క్వాడ్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపడుతున్నారన్నారు. తమ ప్రాంతంలో ఎదైన సమాచారం ఉంటే పోలీసులు కానీ... తమకు కానీ సమాచారం అందించాలన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువగా నగదును తీసుకొని ప్రయాణించే సమయంలో అందుకు సంబంధించిన పూర్తి వివరాలు తమ వద్ద భద్రపరుచుకోవాలన్నారు. డబ్బుకు సంబంధించిన పత్రాలు లేకుంటే వాటిని సీజ్ చేస్తామన్నారు. రూ.10 లక్షల లోపు ట్రెజరీకి సమాచారం అందించి జమ చేస్తున్నామన్నారు. రూ.10 లక్షల కంటే ఎక్కువగా ఉంటే ఐటీ అధికారులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. డబ్బుకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కానీ.. ఐటీ శాఖ కార్యాలయంలో పూర్తి ఆధారాలు చూపించి తీసుకొచ్చన్నారు. ఓటర్లు ప్రస్తుతం ఆన్‌లైన్ తమ పేర్లను సరి చూసుకోవాలన్నారు. ఎన్నికల రోజు తమ పేరు లేదని తెలపడం కంటే ప్రస్తుతం ఆన్‌లైన్‌తో పాటు వివిధ యాప్‌లలో ఓటర్‌గా చూసుకోవచ్చన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ గం

## వైభవంగా సుదర్శన హోమం



శ్రీవారి ఉత్సవమూర్తి విగ్రహ ఊరేగింపు



వెంకటేశ్వర దేవాలయంలో సుదర్శనహోమం

శంషాబాద్: శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో ఐదోరోజు బ్రహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం బాలభోగం అనంతరం వేదమంత్రోచ్చరణాలతో సుదర్శనహోమాన్ని నిర్వహించారు. సాముహిక విష్ణు సహస్రనామ పారాయణం, సాముహిక గోవిందార్చన కార్యక్రమాలతో గోవిందనామం మార్మోగింది.

## పోటాపోటీగా 'టీపీజీఎల్'

గోల్కొండ: శ్రీనిధి యూనివర్సిటీ తెలంగాణ సీనియర్ గోల్ఫ్ లీగ్ పోటాపోటీగా జరుగుతోంది. గోల్కొండ నయాఖిలాలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్టులో జరుగుతున్న ఈ టోర్నీలో గోల్ఫర్లు తమ ప్రతిభను చాటుతున్నారు. 3వ రౌండ్‌లో లహరి లయన్స్ ఆటగాళ్లు వివేక్‌చంద్రశేఖర్, అక్రమ్‌ఖాన్, మణికాంత్, సంజయ్‌గడిపాటి అత్యుత్తమ ఆటతో తమ టీమ్ స్కోర్‌ను 15 పాయింట్లు చేశారు. అదే విధంగా ఎంవైకే టీమ్ 14.5 పాయింట్లతో రెండవ స్థానంలో కొనసాగుతోంది. ఈ టీమ్‌కు చెందిన ఆటగాళ్లు మంచి స్ట్రైక్‌తో తమ టీమ్ స్కోర్‌ను మెరుగుపరిచారు.



## ముమ్మరంగా వాహన తనిఖీ

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై నార్సింగి పోలీసులు, రెవెన్యూ అధికారులు వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ద్విచక్ర వాహనాలతో పాటు, కార్లను క్షుణంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి డబ్బులు తరలిస్తున్న వాహనాలను గుర్తించి నగదును సీజ్ చేస్తున్నారు.ఎవరైనా డబ్బులు తరలించే వారు అందుకు సంబంధించిన పేపర్లను చూపించాల్సిన ఉంటుందన్నారు. పోలీసులకు ప్రజలు సహాకరించాలని సూచించారు.



బండ్లగూడ రహదారిపై తనిఖీలు చేస్తున్న పోలీసులు

## ప్రేమావతిపేట్ గ్రామంలో చెత్తపై సమరం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రేమావతిపేట్ గ్రామంలో చెత్తపై జై భీమ్... జై రామ్ సంఘం కమిటీ ప్రతినిధులు సమరం ప్రకటించారు. వారం పాటు ప్రేమావతిపేట గ్రామంలో చెత్త బయట వేయకుండా చెత్త ఆటోకి వేసే విధంగా దళిత బస్తీవాసులను చైతన్యం చేస్తూ ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కమిటీ సభ్యులు రోడ్ల మీద చెత్త వేయకుండా బస్తీవాసులను జాగృతం చేశారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ మురికివాడల అభివృద్ధి కోసం పాటుపడినందుకు ఢిల్లీలోని ఓయాసిస్ యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసిన సందర్భంగా జై భీమ్... జై రామ్ సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు.



డీసీ రవి కుమార్‌ను సన్మానిస్తున్న కమిటీ ప్రతినిధులు

## రాజేంద్రనగర్ పరిధిలో కోటి రూపాయలు సీజ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో బుధవారం వరకు కోటి రూపాయలను సీజ్ చేసినట్లు ఏసీపీ గంగాధర్ వెల్లడించారు. ఎన్నికల నియమావళి అమలైన రోజు నుంచి విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. తనిఖీల సమయంలో ఎలాంటి దస్తావేజులు, నగదుకు సంబంధించిన వివరాలను తెలపకపోవడంతో కోటి రూపాయలను స్వాధీనం చేసుకొని ట్రెజరీలో జమ చేశామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో నేషనల్ పోలీసు అకాడమీ, పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే, పిల్లర్ నంబర్–118, పల్లె చెరువు, పాలమాకుల ప్రధాన రహదారి, టిప్పుఖాన్ బ్రిడ్జి వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఈ చెక్ పోస్టుల వద్ద 24 గంటల పాటు తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. అనుమానం ఉన్న ప్రతి ఒక్కరిని సోదా చేస్తున్నట్లు వెల్లడించారు.

## హత్య కేసులో రౌడీషీటర్ గౌస్ అరెస్ట్

రాజేంద్రనగర్: రౌడీషీటర్ సర్వర్ హత్య కేసులో రౌడీషీటర్ ఖూనీ గౌస్‌ను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులకు లొంగిపోవాలని సర్వర్ ఖూనీ గౌస్‌కు తెలపడంతో ఆగ్రహించి సర్వర్‌ను గత వారం హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఖూనీ గౌస్‌తో పాటు అతనికి సహకరించిన ఇద్దరిని పోలీసులు మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. ఖూనీ గౌస్ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తుండటంతో తన ఇద్దరు అనుచరులతో కలిసి లొంగిపోయాడు. ఖూనీ గౌస్ అనుచరుడు కోర్టును ఆశ్రయించాడు. ఖూనీ గౌస్ పోలీసులకు లొంగిపోయాడని.. కానీ పోలీసులు అరెస్ట్ చూపడం లేదంటూ కోర్టును ఆశ్రయించడంతో పోలీసులు మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. సర్వర్‌ను హత్య చేసిన సమయంలో ఖూనీ గౌస్ మరో ఇద్దరిని హత్య చేసిన అనంతరం పోలీసులకు లొంగుతానని వెల్లడించడంతో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖూనీ గౌస్‌పై మరోసారి పీడీ యాక్ట్ కోసం ఉన్నతాధికారులకు సిఫారసు చేసినట్లు ఏసీపీ గంగాధర్ తెలిపారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న రాజేంద్రనగర్ అదనపు డీసీపీ సాధన రష్మీ పెరుమాల్

రాజేంద్రనగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజేంద్రనగర్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగను తెలంగాణ రాష్ట్రంలో ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఈ బతుకమ్మ సంబరాలకు రాజేంద్రనగర్ అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు సాధన రష్మీ పెరుమాల్ ముఖ్య అతిథిగా పాల్గొని బతుకమ్మ పూజలు చేసి విద్యార్థినీలతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. విద్యార్థినుల నృత్యం చూసి అభినందించారు.

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని విస్తరణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. రంగురంగుల పూవ్వులతో బతుకమ్మను పేర్చి కార్యాలయం ముందు బతుకమ్మ పాటలుపాడుతు,ఆటలు ఆడారు.

**ధర్మగిరిలో నేడు బతుకమ్మ సంబరాలు**

శంషాబాద్ : పట్టణంలోని ధర్మగిరి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం బతుకమ్మ సంబరాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు స్వాతి దత్తు, ఆలయ ట్రస్టీ శివదత్తసాయి తెలిపారు. సాయంత్రం4 గంటలకు బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

**విజ్ఞాన్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు**

బండ్లగూడ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని విజ్ఞాన జూనియర్, డిగ్రీ కళాశాలల చైర్మన్ గౌరీ సతీష్ అన్నారు. బతుకమ్మ ఉత్సవాలను బుధవారం బండ్లగూడలోని విజ్ఞాన్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది కళాశాలకు తీసుకువచ్చారు. సాంప్రదాయ వేషాధారణలో బతుకమ్మ పాటలకు అనుగుణంగా ఆటలు ఆడారు.





విజ్ఞాన్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో విద్యార్థినులు, గౌరీ సతీష్

## మజ్లిస్ పార్టీకి ప్రజల మద్దతు



షేక్ రఫీక్‌తో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి ప్రజల మద్దతు, ఆశీర్వాదం మెండుగా ఉన్నాయని ఆ పార్టీ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని మోగల్‌కా నాలా, మొగల్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త తరలింపునకు అదనపు యూనిట్లను నియమించడం జరిగిందని దీంతో చెత్త తరలింపు, చెత్త కుప్పలు పేరుకుపోవడం ఉండడం లేదని ఆయన అన్నారు. ప్రజల ఫిర్యాదులపై తాము ఎప్పటికప్పుడే స్పందిస్తామని ఏ చిన్న సమస్య ఉన్నా కూడా వెంటనే దానిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా షేక్ రఫీక్, షేక్ అమీద్‌లు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు.